క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సంఘానికి విరాళాలు


భాస్కర్‌రాజుకు విరాళం అందిస్తున్న విజయలక్ష్మీ

పుత్తూరు: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి ఆదివారం పాలసముద్రం మండలం తిమ్మరాజుపురం గ్రామానికి చెందిన పెన్షనర్ విజయలక్ష్మీ తన తండ్రి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పి.వెంకటమున్ని రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదు మొత్తాలను సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, కృపావరమ్మ, రామలింగ ఆచ్చారి, కుప్పయ్య, నిర్మలాజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వివరించేందుకే వికసిత్ యాత్ర


మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకే వికసిత్ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుత్తావాండ్లవూరు పంచాయతీ వడ్డిగుడిసెలు, మోపిరెడ్డిపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వికసిత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. సంకల్ప యాత్ర రథంలో వికసిత్ సంకల్పయాత్రకు సంబంధించిన వీడియోలను విడుదల చేశారు. వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, సర్పంచ్‌లు అమ్ములు, సునీత, వాసుదేవనాయుడు పాల్గొన్నారు

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో ఆదివారం హిమాచలంబాబు, వనజ దంపతుల ఆధ్వర్యంలో శ్రీగోదాదేవి శ్రీరంగనాథ స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్త సమూహం మధ్యన వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వధూవరులుగా తీర్చిదిద్ది కళ్యాణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, హారతులిచ్చారు. అనంతరం పి.పయణి భగవద్గీత పారాయణం, సంకీర్తనలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రముఖ శల్య వైదులు ఎస్.ప్రకాష్‌రాజు, జుగల్‌కిషోర్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం భాగవత పారాయణం, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ లారీ మోహన్ పర్యవేక్షించారు. ధనుర్మాసం చివరి రోజు కావడంతో పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నగరిలో..

నగరి: టీటీడీకి చెందిన కరిమాణిక్య స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నెల రోజులపాటు గోదాదేవి వ్రతం చేస్తూ తిరుప్పావై ప్రవచనాలు పఠించిన భక్తులు ధనుర్మాసం ముగింపు రోజున అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి పూజా సామగ్రితో ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత కరిమాణిక్యస్వామిని మంత్రి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తిరుమల దేవస్థానం నుంచి విచ్చేసిన వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దేదీప్యమానంగా అలకరించిన గోదాదేవి, శ్రీనివాసుల కల్యాణం నేత్రపర్వంగా నిలిచింది. కల్యాణోత్సవం అనంతరం అమ్మవారి పసుపు, అక్షింతలు ప్రసాదంగా మంత్రికి అందజేశారు. మహిళలు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి దంచిన పసుపుముద్దతో పాటు వస్త్రాలను, పండ్లు, పాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి సమర్పించారు. విచ్చేసిన భక్తులందరికీ ఆలయ అధికారులు ప్రసాదాలతోపాటు పసుపు, అక్షింతలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, టీటీడీ ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు, అర్చకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, గోదాదేవి సమేత శ్రీనివాసుని దర్శించుకుంటున్న మంత్రి ఆర్కే రోజా దంపతులు


పుత్తూరులో గోదాదేవి కల్యాణోత్సవం


ఆలయం వద్ద అన్న ప్రసాదాల పంపిణీ

గంగమ్మకు కానుకగా వెండి శూలాలు


ఊరేగింపుగా తీసుకొస్తున్న వెండి శూలాలు

పుత్తూరు: గ్రామ దేవత పిడికిలి గంగమ్మకు పుత్తూరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎం.శ్రీనివాసులు రూ.25 వేలు విలువ చేసే రెండు వెండి గెరిగ శూలాలను కానుకగా అందజేశారు. ఆదివారం ఉదయం శూలాలకు స్థానిక శ్రీద్రౌపదీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ శూలాలను ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి తీసుకుని వచ్చారు. అనంతరం గంగమ్మ ఆలయం వద్ద గంగ జాతర కమిటీ సభ్యులకు అందజేశారు. గంగమ్మ ఆలయంలో శూలాలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపణీ చేశారు. ఈ శూలాలను ప్రతి ఏటా గంగమ్మ జాతర సందర్భంగా నిర్వహించే గెరిగ ఊరేగింపులో అమ్మవారి చెంత ఉంచుతారు.

చర్చిలో సంక్రాంతి సంబరాలు


చర్చిలో సంక్రాంతి సంబరాలు

నగరి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగను స్థానిక సీఎస్‌ఐ ఈస్ట్ పాస్టరేట్ చర్చిలో నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఫాస్టర్ జొనాథన్ లెక్లర్ ఆధ్వర్యంలో చర్చిలో చెరుకు గడలు, పొంగలి కుండలు ఏర్పాటు చేసి సంక్రాంతి వాతావరణాన్ని తెప్పించారు. అందరికీ మంచి జరగాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ పండుగలు మతాలకు అతీతమన్నారు. ప్రతి పండుగ ప్రజలకు ఆనందాన్ని పంచేదిగా ఉండాలన్నారు. ప్రార్థనల అనంతరం చక్కెర పొంగలి, చెరకు గడలను అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి పూజలు


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఆదివారం స్థానిక వినాయక ఆలయంలో గోదాదేవి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా గ్రామంలో గోదాదేవికి గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోడ్డు ప్యాచ్‌వర్క్

నగరి: మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన రోడ్డు ప్యాచ్‌వర్కు పనులను రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి ఆదివారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఇటీవల మంత్రిని కలసి విన్నవించుకున్న మేరకు ఈ పనులను ట్రస్టు ద్వారా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రూ.1.60 లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈవీ బాలకృష్ణన్, కౌన్సిలర్లు గంగాధరం, భూపాలన్, మురుగ, ఇలంగో, రాజముత్తు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు పరిశీలిస్తున్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి

కప్పేసిన పొగమంచు



పాలసముద్రం: మండలంలో ఆదివారం పొగమంచు కప్పేసింది. ఉదయం 8.30 గంటలు అయినా సూర్యకిరణాలు కనపడలేదు. వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. ఈ పొగమంచుతో మిరప, మామిడి పూత రాలిపోతుందని, వరి, వేరుశనగకు తెగుళ్ల ఎక్కువగా సోకుతాయని రైతులు అంటున్నారు. పొగమంచు కారణంగా చలికి తట్టుకోలేక చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రేమను పంచే పెద్ద పండుగ


వెదురుకుప్పం: కోణంగిపల్లెలో ముగ్గులు వేస్తున్న మహిళలు


శ్రీకావేరిరాజుపురంలో..


ఎస్‌ఆర్‌పురంలో..


నింద్రలో భోగి మంటలు


జనంతో కిటకిటలాడుతున్న వస్త్రదుకాణం


పసుపు కొమ్ములు, చెరుకు గడల విక్రయాలు

• పల్లెల్లో సంక్రాంతి సందడి

నగరి: ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ సంక్రాంతి పండుగ రానే వచ్చింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యుడు మకరరాశిలోకి సంక్రమణం చేసే పర్వదినాన్ని మకర సంక్రాంతిగానూ, దాని ముందురోజు భోగి, తర్వాత కనుమ, ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ నాలుగు రోజులను పవిత్ర దినాలుగా భావించి ప్రజలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతి సందడితో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆహ్లాదకర వాతావరణమే దర్శనమిస్తుంది. నగరి మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో ఇక్కడ జరిపే సంక్రాంతి పండుగ రెండు సంస్కృతుల సమ్మేళనంగా ఉంటుంది. మున్సిపల్ పరిధి కొత్తపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, కేవీపీఆర్‌పేట సత్రవాడ ప్రాంతాలలో అధిక సంఖ్యలో తమిళ సంప్రదాయాలు పాటించే నేత సామాజిక వర్గంవారు ఉన్నారు. వీరు సంక్రాంతి పండుగను «పొంగల్» పేరుతో నిర్వహిస్తారు. వ్యాపారాలకు సంబంధించిన నూతన ఖాతాలను ఆ రోజు నుంచే ప్రారంభిస్తారు. తమ వద్ద పనిచేసే వారికి అక్కడే నేసిన పంచెలు, చీరలు అందిస్తారు. రెండు రోజుల ముందు నుంచే ప్రతి ఇంటి ముందు మహిళలు పొయ్యి తయారుచేసి అరుగులపై ఎండబెట్టారు. సంక్రాంతి నేపథ్యంలో వ్యాపార సముదాయాలన్నీ సందడిగా మారాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండుగలో ప్రాధాన్యం సంతరించుకునే రంగుల ముగ్గుపిండి, మట్టికుండలు, చెరుకు గడలు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో ఫ్యాన్సీ దుకాణాలు రద్దీగా ఉన్నాయి. ప్రధాన కొనుగోలుదారులతో సందడిగా మారింది.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలంలో తెలుగుదనం ఉట్టి పడేలా భోగి పండుగను జరుపుకున్నారు. ప్రతి ఇంటముందు వేసిన రంగవల్లులు పలువురిని ఆకట్టుకున్నాయి.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: తెలుగువారి లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు ఆదివారం భోగితో ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజాము నుంచే భోగి మంటల వేసి చుట్టూ నిలబడి గొబ్బిళ్లు, డప్పు వాయిస్తూ చిందులు వేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో ఘనంగా భోగి పండుగను జరుపుకున్నారు. ఇంటింటా భోగిమంటలు వేసి సందడి చేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. ఇంటింటా సంక్రాంతి సందడి నెలకొంది.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్ల వద్ద పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు. బొమ్మన్‌దొడ్ల, పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, దేవళంపేట గ్రామాల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి పండుగచేసుకున్నారు. కోణంగిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా భోగి పండుగ

నింద్ర: పవిత్ర భోగి పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం మండలంలోని ప్రజలు భోగి మంటలు వేశారు. పిల్లలు ఉదయం 3 గంటలకే తమ ఇంటి ముందు భోగి మంటలు వేసి నూతన దుస్తులు ధరించారు. అనంతరం గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అత్తూరు, అరూరు, అగరం, ఇరుగువాయి గ్రామాల్లో యవకులు గ్రామంలో భోగి మంటలు వేశారు.


పొంగలి కుండల విక్రయాలు


ముగ్గుల రంగుల విక్రయాలు

పెద్ద శేష వాహనంపై శ్రీమూలస్థాన ఎల్లమ్మ


శ్రీలక్ష్మీ అలంకరణలో శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఊరేగింపు

చంద్రగిరి: సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ దేవి ఆలయంలో ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీగజలక్ష్మీ అలంకరణలో గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణోత్సవం


కల్యాణ వేదికపై శ్రీగోదాదేవి, శ్రీరంగనాథ స్వామివారు

తిరుపతి కల్చరల్: పవిత్రమైన ధనుర్మాసం ముగింపు సందర్భంగా అన్నమాచార్య కళా మందిరంలో ఆదివారం శ్రీగోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం తిరుపతికి చెందిన ఎం.భానుజ బృందం గోదాదేవి వైభవాన్ని చాటే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో డిసెంబర్ 17 నుంచి నెల రోజులపాటు చేపట్టిన తిరుప్పావై ప్రవచనాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఏఈవో శ్రీరాములు, సూపరింటెండెంట్ రామచంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.